క్లుప్తంగా

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు


సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పందన, జగనన్నకు చెబుదాం(1902)కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో పి.సూర్యనారాయణ తెలియజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. శాఖల వారీగా వచ్చిన ఫిర్యాదుల్లో తక్షణ పరిష్కారాలు చూపినవి, ప్రస్తుతం పరిష్కార దశలో ఉన్నవి, తిరస్కరించిన వాటిపై సమీక్షించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపించారు. సమావేశంలో తహసీల్దార్ పి శేఖర్, ఎంఈవో ధనం జయ మజ్జి, హెచ్‌వో పి.మాధవీలత, ఎస్ఐ కె.రాము, ఈవోపీఆర్డీ శివాజీ పాణిగ్రాహి, ఏపీఎం కె.గోవింద, ఏపీవో కడియం భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న సన్యాసిపుట్టుగ యువకులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని సన్యాసిపుట్టుగ గ్రామానికి చెందిన నీలాపు కేదారేశ్వర రావు కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. అసలే నిరుపేద కుటుంబం, ఆపై ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబం వీధిన పడింది. దీంతో స్పందించిన స్థానిక యువకులు, గ్రామస్తులు రూ.1,21,000 లను విరాళాలుగా సేకరించి శుక్రవారం మృతుని కుటుంబానికి అందజేశారు. దీంతో ఆ కుంటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాళ్లపేట ఇక లేరు


కృష్ణారావు (ఫైల్)

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి-గోవిందపురం గ్రామానికి చెందిన నాయీ బ్రాహ్మణ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ గురుస్వామి రాళ్లపేట కృష్ణారావు(70) ఇక లేరు. గత వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం తుదిశ్వాస విడిచారు. దాదాపు 32 ఏళ్ల పాటు మాలాధారణ చేపట్టి ఈ ప్రాంతంలో గురుస్వామిగా ఆయన సుపరిచితుడు. ఈ సందర్భంగా ఆయన కుటుంబాన్ని జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు డాక్టర్ ఆర్.అరవింద్, కె.గజపతిరావు, అప్పారావు, జగన్నాథరావు తదితరులు పరామర్శించారు.

ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి కృషి


రోగులతో మాట్లాడుతున్న ఎంపీపీ దాస్

సోంపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. మండలంలోని బట్టిగళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఎంపీపీ పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అనంతరం ఆస్పత్రిలో అందుతున్న సౌకర్యాలు గురించి రోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.మాధవరావు, పార్టీ నాయకులు బైపల్లి కామేశ్వరరావు, వైద్యులు హరికిరణ్, భవిసాయి తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలు ద్వారా బోధించాలి


మాట్లాడుతున్న సీడీపీవో నాగరాణి

ఇచ్ఛాపురం రూరల్: పూర్వ ప్రాథమిక విద్యార్థులు అన్ని అంశాల్లో పురోగతి సాధించేలా బొమ్మలు ద్వారా బోధన చేయాలని ఇచ్ఛాపురం రూరల్ సీడీపీవో పురాణం నాగరాణి సూచించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సెక్టారు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆంగ్ల భాషపై విద్యార్థులు పట్టుసాధించేందుకు, బోధన చేసేందుకు బొమ్మలతో కూడిన పుస్తకాలు ఇవ్వడం జరిగిందన్నారు. శారీరక అభివృద్ధి పేరిట వారి చేతివేళ్లు రాయడానికి అనువుగా ఉండేలా, ఆటలు ఆడేందుకు వీలుగా అందజేసిన వస్తువులు, ఆట సామాగ్రిని సద్వినియోగపరచాలని సూచించారు. సమావేశంలో సూపర్‌వైజర్లు నీలవేణి, పల్లవిలు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ మేలు


నందిగాం: దిమ్మడిజోలలో మాట్లాడుతున్న దువ్వాడ శ్రీనివాస్

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

నందిగాం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ మేలు చేయడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని దిమ్మడిజోలలో వైస్ ఎంపీపీ రేగల లక్ష్మీకాంతం, దీనబంధుపురం సర్పంచ్ మడపాల సంజీవరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దువ్వాడ మాట్లాడుతూ.. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, ఎంపీడీవో శివప్రసాద్, డీటీ భాగ్యలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ జడ్యాడ జయరాం, కురమాన బాలకృష్ణారావు, చిన్ని జోగారావు, తమారె ఫాల్గుణరావు, అంబోడి విష్ణు, కణితి నారాయణమూర్తి, శాంబాన దాలయ్య, తమిరె రాజు, పోలాకి మోహనరావు, కొల్లి శ్రీరాములు, తమిరె దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.


కోటబొమ్మాళి: వాంఢ్రాడలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న దువ్వాడ వాణి

కోటబొమ్మాళి: గత నాలుగేళ్లలో వాంఢ్రాడ సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాలకు రూ.14 కోట్లు ఖర్చు చేసినట్లు టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని వాంఢ్రాడ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. మొత్తం 181 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో తులా రాజారావు, వెటర్నరీ ఏడీ ఎం.లోకనాథం, సర్పంచ్‌లు మెండ తాత, వెలమల శాంతారావు, ఎంపీటీసీలు వాన ఆసిరినాయుడు, గూట్ల లక్ష్మణరావు, గ్రామ కార్యదర్శులు పల్లి వెంకటేష్, వై.ధనుంజయ, వెల్ఫేర్ అసిస్టెంట్ పూజారి రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్య పరిరక్షణకు ఐక్యమవ్వాలి'


చారుమజుందార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లిబరేషన్ నాయకులు

పలాస: దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు బీజేపీయేతర పార్టీలు ఐక్యమవ్వాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకుడు మద్దిల రామారావు పిలుపునిచ్చారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో సీపీఐఎంఎల్ వ్యవస్థాపక నాయకుడు, నక్సలబరి నేత చారుమజుందార్ వర్ధంతి సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చారుమజుందార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామారావు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఆరంభంలో పాట్నాలో లిబరేషన్ పార్టీ 11వ మహాసభలు జరిగాయన్నారు. ఆ రోజు పార్టీ మహాసభ ఇచ్చిన 'సేవ్ డెమొక్రసీ', 'సేవ్ ఇండియా' సింహనాదం నేడు దేశవ్యాప్తంగా వినిపిస్తోందన్నారు. తీవ్రమవుతున్న సమస్యలపై దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిరసనలు, పోరాటాలు వెల్లువెత్తున్నాయని తెలియజేశారు. గత తొమ్మిదేళ్లుగా ప్రధానమంత్రి మోదీ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రత్యామ్నాయ ప్రభుత్వం నేడు ఎంతో అవసరమని, అందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జె.నేతాజీ, మద్దిల రాజారావు, సార పాపయ్య, పున్నయ్య, తవిటయ్య, అప్పయ్య, రామయ్య, దేవరాజు, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్‌తో పర్యావరణానికి హాని


మొక్కలు నాటుతున్న ఏడీ చంద్రశేఖరరావు తదితరులు

కాశీబుగ్గ: పాలిథిన్‌తో పర్యావరణానికి హాని జరుగుతోందని పలాస పశువైద్య శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ పోతనపల్లి చంద్రశేఖరరావు అన్నారు. పలాస ఏడీ కార్యాలయం ఆవరణలో ప్రకృతి దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిగిలిపోయిన, పాడైన ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో వేసి విసిరేయవద్దని సూచించారు. ఆ ఆహారాన్ని కవర్‌తో పాటు పశువులు తినేయడం వలన కడుపు నొప్పితో మరణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ జంట పట్టణాల్లో ఉన్నటువంటి దుకాణదారులు, వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను విరివిగా వాడుతున్నా, అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఆర్.శాంతికుమారి, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బి.గోపాల్, నేషనల్ అవార్డు గ్రహీత ఆసపాన మధుబాబు, ఆర్టీవో సహాయకుడు దాసరి వైకుంఠరావు, కొత్తపల్లి చిన్నాచారి, డాక్టర్ మధు, డాక్టర్ కల్యాణ్, ఇచ్ఛాపురం ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

జీడి రైతుల పోరాట పాటలు విడుదల


పాటలు విడుదల చేస్తున్న రైతు నాయకులు

పలాస: ఆంధ్రప్రదేశ్ జీడి రైతు సంఘం ఆధ్వర్యంలో గత కొంతకాలంగా జరుగుతున్న జీడి పోరాటానికి మద్దతుగా శుక్రవారం పలు పాటలను విడుదల చేశారు. ఈ పాటలను రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రూపొందించగా, రైతు సంఘం నాయకులు జీడి రైతుల సత్యాగ్రహ శిబిరం వద్ద విడుదల చేస్తూ ప్రజలకు వినిపించారు. రైతు సంఘం ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ మాట్లాడుతూ జీడి రైతు ఉద్యమానికి రంగం రాజేష్ అందించిన పోరు పాటలు నూతన ఉత్తేజాన్ని ఇస్తాయన్నారు. అలాగే ఉద్దానం ప్రాంతానికి చెందిన పలువురు కళాకారులు, రచయితలు కూడా తమదైన పద్ధతులో స్పందించి మంచి ఉద్యమ గీతాలను అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాయకులు, రచయితలు కుత్తుం వినోద్, గుమ్మిడి సాంబమూర్తి, దుబ్బ రాజగోపాల్, సాతుపల్లి కాంతారావు, కోటి, డొక్కర కామేష్, బాలాజీరావు, శంకర్ పాల్గొన్నారు.

సీఐ శ్రీనివాసరావుకు సత్కారం



సీఐ శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రంలో ఉన్నటువంటి పోలీసుస్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గుగ్గిలాల శ్రీనివాసరావును కాశీబుగ్గ సెయింట్ ఫ్రాన్సిస్ డీసేల్స్ విద్యా సంస్థలకు చెందిన ఫాదర్‌లు శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫాదర్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు సుడియా జోగారావు, మురళీ, హరినారాయణ, రాజు, శ్రీనివాస్, పిట్ట పద్మజ, ప్రవీణ, సరితమ్మ పాల్గొన్నారు.

'బిల్లుల కలెక్షన్ సెంటర్ తెరుస్తాం'

కాశీబుగ్గ: శనివారం, ఆదివారం ప్రభుత్వ సెలవు దినములు అయినప్పటికీ జిల్లాలో ఉన్నటువంటి విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం కలెక్షన్ సెంటర్లు తెరిచి ఉంచుతామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని పలాస విద్యుత్ డివిజన్ కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

తక్షణ సాయం అందజేత


వజ్రపుకొత్తూరు: తక్షణ సాయం అందజేస్తున్న సర్పంచ్ బాలరాజు


కంచిలి: తక్షణ సాయం అందజేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: మండలంలోని పోలేరు పంచాయతీ పరిధి కొండపోలేరు గ్రామానికి చెందిన బుడ్డెపు తిరుపతిరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి చేతులమీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం పోలేరు గ్రామానికి చెందిన వాసెట్టి రాజులమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆ కుటుంబాన్ని ఎంపీపీ పరామర్శించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, లడ్డుకేశవపాత్రో, సురేష్, బల్ల తిరుపతి తదితరులు ఉన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని అమలపాడు గ్రామానికి చెందిన కర్ని రాజేశ్వరి ఇటీవల మరణించింది. దీంతో ఆ కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలును సర్పంచ్ దున్న రత్నం బాలరాజు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు దున్న పోతనపల్లి లింగరాజు, దున్న ఢిల్లీరావు, దున్న సంగీత తదితరులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

టెక్కలి: అఖిల భారత విద్యార్థి పరిషత్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జూనియర్ కళాశాలల బంద్ ప్రశాంతంగా ముగిసింది. విద్యార్థి సంఘం ప్రతినిధులు మురళి, శ్యామ్, విశ్వనాథ్ తదితరులు పలు కళాశాలలను మూయించారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన


కాశీబుగ్గ: నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

కాశీబుగ్గ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలాస విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదురుగా విద్యుత్ ఉద్యోగులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర, జిల్లా జేఏసీ పిలుపు మేరకు ఐకాస దశల వారీగా చేపట్టిన నిరసన ర్యాలీ రెండో రోజు నిర్వహించారు. ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఈఈ ప్రసాదరావు, డీఈఈ కృష్ణమూర్తి, పలాస, కాశీబుగ్గ, మందస ఏఈలు, ఏవోలు భాస్కరరావు, గార రాజారావు, కొమ్మల గిరీశ్వరరావు, హిమగిరి, నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని విద్యుత్‌శాఖ డీఈఈ కార్యాలయం వద్ద రెండో రోజు నిరసన కొనసాగించారు. మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలను ధరించి తమ డిమాండ్లను నినాదాల రూపంలో వివరించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


భోగాపురంలో సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

మందస: సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం పర్యటించారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. జీతాల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ, ఎరియర్ విడుదల చేయాలని కోరారు. కొత్త పీఆర్సీ, మధ్యంతర భృతిని కూడా ప్రకటించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు గవ్వ భీమారావు, వి.వి.వరప్రసాద్, ఎస్.కిరణ్ కుమార్, డి.మోహనరావు, డి.వేణుగోపాల్. బి.శివ, వసంతనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కవిటి: మండలంలో బొరివంక ఉప విద్యుత్ కేంద్రం పరిధిలోని మాణిక్యపురం, బల్లిపుట్టుగ, వరక గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు కవిటి ఇన్‌ఛార్జి ట్రాన్స్‌కో ఏఈ ఎం.నేతాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎస్‌కేఈ రోడ్డు విస్తరణ కార్యక్రమంలో భాగంగా అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు నేపథ్యంలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

శరవేగంగా ఇంటింటా ఓటర్ల సర్వే


డొంకూరులో సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో నిర్వహిస్తున్న ఇంటింటా ఓటర్ల సర్వే శరవేగంగా సాగుతోంది. బూత్‌స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ జాబితాతో సర్వే చేస్తున్నారు. సర్వే సమయంలో ఓటర్ డోర్ నంబర్, ఫొటో, వయస్సు మొదలగు పూర్తి వివరాలు సరిచూస్తారని, అందులో ఏమైనా తప్పు ఉంటే వాటిని సరిచేసేందుకు చర్యలు తీసుకుంటారని ఎన్నికల డీటీ శ్రీహరి తెలిపారు. ఇప్పటికే 21 పంచాయతీల్లో ఈ ప్రక్రియ సాగుతోదన్నారు.

వాహనాల వేలంపాట నేడు

సోంపేట: స్థానిక ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన 8 వాహనాలకు శనివారం వేలంపాట నిర్వహించనున్నట్లు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ టి.వెంకటప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 10 గంటలకు ఎక్సైజ్ కార్యాలయం వద్దకు వచ్చి దరావత్తు సొమ్ము రూ.1000 చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న పిరియా సాయిరాజ్ తదితరులు

- పిరియా సాయిరాజ్
- సోంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం

సోంపేట: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. సోంపేట సచివాలయం-1 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకూ వస్తున్నామని తెలియజేశారు. అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించే దిశగా పాలన సాగుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. అనునిత్యం ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్‌రెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, సోంపేట సర్పంచ్ నగిరి ప్రభావతి, ఉప సర్పంచ్ ఎం.వెంకటరమణ, సుంకిడి సర్పంచ్ ఎస్.భాస్కరరావు, ఎంపీటీసీలు పొడుగు కామేష్, ధర్మారావు, పార్టీ నాయకులు నెహ్రూ, ధర్మారావు, బి.ఢిల్లీరావు, కె.శ్రీనివాసరావు, ఈపరి రవి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం


రైతులకు ఎరువులు అందజేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొల్లూరు రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీ ధరలకు ఎరువులు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పైల లక్ష్మీనారాయణ, వీఏఏ సాగర్, కాయ నూకయ్య, గేదెల దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లీనిక్‌లతో మేలు

కంచిలి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లీనిక్‌లతో ప్రజలకు మేలు జరుగుతోందని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండలంలో కొల్లూరు గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శుక్రవారం సందర్శించారు. అక్కడికి వచ్చిన రోగులతో కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆయనతోపాటు స్థానిక నాయకులు ఉన్నారు.

నువ్వలరేవులో గడప గడపకూ నేడు


సమావేశంలో మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని నువ్వలరేవు గ్రామంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు, అలాగే ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటల (రెండు రోజులు) నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ మేరకు గ్రామంలో అధికారులు, గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. ప్రజా సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ఆయన అడుగు జాడల్లో మంత్రి సీదిరి అప్పలరాజు నడుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు యజ్ఞా, దేవా, ముకుంద, ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఈవోపీఆర్డీ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో రాష్ట్రంలో నవశకం


లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న దువ్వాడ వాణి

- దువ్వాడ వాణి
- పెద్దబాణాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

నందిగాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన నవరత్నాలతో రాష్ట్రంలో నవశకం వచ్చిందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని పెద్దబాణాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేదలకు వివిధ పథకాల ద్వారా మేలు చేస్తున్న జగనన్నను ఎదుర్కోలేక, పచ్చ మీడియా సాయంతో టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు నిజాలు తెలుసుకొని అనునిత్యం మేలు చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో దువ్వాడ హైందవి, నాయకులు పైల రమేష్ నాయుడు, కింతల ధర్మారావు, జేసీఎస్ కన్వీనర్ జడ్యాడ జయరాం, ఫల్గుణరావు పాల్గొన్నారు.